క్లుప్తంగా

నేడు ఆరుద్రోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

భట్టిప్రోలు: భట్టిప్రోలు వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కొలువైన గంగాపార్వతి సమేత నగరేశ్వరస్వామివారి ఉత్తర ద్వారదర్శనం(ఆరుద్రోత్సవం)కు సకల ఏర్పాటు చేసినట్లు దేవస్థాన కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే భట్టిప్రోలులో కొలువైన మల్లేశ్వరస్వామి, విశలేశ్వరస్వామి, వెల్లటూరులో కొలువైన అస్తేశ్వరస్వామి దేవాలయాలలో కూడా శివ ముక్కోటికి సన్నాహాలు చేయడం జరిగిందని దేవస్థానాల కార్యనిర్వహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు తెలిపారు.

విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత గుర్తించిన వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. హిమోగ్లోబిన్ పెరగడానికి భుజించాల్సిన పదార్థాలను గూర్చి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ డి. మాతయ్య, హెల్త్ సూపర్‌వైజర్ నీలా ప్రసన్నబాబు, హెచ్‌వీ కల్యాణి, హెచ్‌ఎం చందలూరి రామ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామదేవత ఆలయంలో చోరీ

రేపల్లె రూరల్: గ్రామదేవత ఆలయంలో వెండి ఆభరణాలతో పాటు, హుండీలోని సొమ్మును అపహరించిన సంఘటన మండలంలోని వడ్డీవారిపాలెంలో గురువారం వెలుగుచూసింది. చోడాయపాలెం ఎస్‌ఐ శివప్రసాద్ కథనం మేరకు వడ్డీవారిపాలెం గ్రామదేవత ఓలేటమ్మ తల్లి ఆలయంలో బుధవారం రాత్రి ఆలయ సిబ్బంది ఎప్పటి మాదిరిగానే తలుపులువేసి వెళ్లిపోయారు. గురువారం తెల్లవారుజామున వచ్చిన చూసేసమయానికి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు ఆలయంలో చోరీకి పాల్పడినట్లు స్థానికులు గమనించి సమాచారం అందించారు. ఆలయంలోని హుండీ సమీపంలోని పొలాలలో పడవేసి ఉందన్నారు. హుండీలో సుమారు రూ.20వేల నగదు, రూ.60వేలు విలువ చేసే వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సచివాలయాల ఏర్పాటు విప్లవాత్మకం

ఎమ్మెల్యే కోన రఘుపతి



బాపట్ల అర్బన్: సచివాలయాల ఏర్పాటుతో విప్లవాత్మకమైన మార్పునకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాందిపలికారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని అడివి–2 సచివాలయానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు సచివాలయాల వ్యవస్థ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. సచివాలయాల సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, ఎంపీడీఓ రాధాకృష్ణ, నాయకులు వడ్డిముక్కల డేవిడ్, కోదండం, వీరారెడ్డి, బొడ్డు సుబ్బారెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి ఉన్నారు.

తెనాలిలో జైనుల భారీ ర్యాలీ



తెనాలిటౌన్: జార్ఖండ్ రాష్ట్రంలో పవిత్రమైన శిఖర్ జీ ఆలయ పవిత్రతను కాపాడాలని కోరుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ జైన్‌లు పట్టణంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. పురుషులతో పాటు స్త్రీలు, చిన్నారులు కూడా ర్యాలీలో పాల్గొనటం విశేషం. గంగానమ్మపేటలోని జైన్ టెంపుల్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సేవ్ శిఖర్ జీ అంటూ నినాదాలు చేశారు. సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైన్ సంఘ నాయకుడు మాట్లాడుతూ 24 మంది తీర్థంకరులలో 20మంది తీర్థంకులు మోక్షం పొందిన జైన్ ఆలయం పై జార్ఖండ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని దుయ్యబట్టారు. తాము ఉపవాసం ఉండి చెప్పులు లేకుండా నడిచి వెళ్లి పవిత్రంగా చూసుకునే జైన్ ఆలయాన్ని టూరిస్ట్ స్పాట్‌గా చేయడం తమను ఎంతో వేధిస్తుందని వారు పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైన్ సంఘీయులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన



మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల జాబితాను అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- రామానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

బాపట్ల అర్బన్: అభివృద్ధి.. సంక్షేమం రెండుకళ్లలా పాలన కొనసాగుతుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని రామానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం జరిగింది. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ప్రభుత్వం అందుతున్న సాయానికి ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీరు, రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేవిధంగా సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన పథకాలు ఎంతో మంది ఉన్నత చదువులకు ఉపయోగకరంగా ఉందని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీడీఓ రాధాకృష్ణ, ఎంపీపీ గవిని కృష్ణమూర్తి, మత్స్యశాఖ డైరెక్టర్ కొలిక్కిలిగడ్డ చెంచయ్య, కోదండం తదితరులు ఉన్నారు.

కుక్కను తప్పించబోయి యువకుడు మృతి



మృతుడు సాల్మన్‌రాజు (ఫైల్)

చెరుకుపల్లి: నైట్ డ్యూటీ చేసి ఇంటికి వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డం రావటంతో, తప్పించబోయి వాహనం అదుపు తప్పి కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండల పరిధిలోని మోరవాకుపాలెం సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం పిట్టలవాని పాలెం మండలం మంతెన వారి పాలెం గ్రామానికి చెందిన నీలా సాల్మన్ రాజు(37) గత తొమ్మిది సంవత్సరాలుగా ఎస్ఎస్ఎల్ టెక్స్టైల్స్ లో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు, బుధవారం రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో రాంబొట్ల పాలెం పంచాయతీ మోరవాకుపాలెం సమీపంలో ప్రధాన రహదారిపై తన ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డం పడటంలో వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో సాల్మన్‌రాజుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి దగ్గరలోని పిట్టలవానిపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తు ఉండగా మార్గమధ్యంలోనే సాల్మన్ రాజు మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు కలరు. మృతుని భార్య సుందరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ డి.వెంకట కొండారెడ్డి తెలిపారు.

7న బీసీ హక్కుల చైతన్య ర్యాలీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

తెనాలిటౌన్: బీసీ హక్కుల కోసం ఈ నెల 7న పట్టణంలో చైతన్య ర్యాలీని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం నాయకులు గురువారం తెలిపారు. డివిజన్ గౌడ సంఘ కార్యాలయంలో గురువారం ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీల జనాభా గణన లెక్కలు తేల్చకుండా కేంద్రం బీసీలను అయోమయ పరిస్థితిలో పడవేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 7వ తేదీన మార్కెట్ యార్డు నుంచి చినరావూరు పార్కు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆదేశాల మేరకు చైతన్య ర్యాలీ జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ పట్టణ అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్, నాయకులు చెన్ను శ్రీనివాసరావు, కందుల సాంబశివరావు గౌడ్, కొడాలి సుబ్రమణ్యం, బెల్లంకొండ సురేష్, కేసన సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పినపాటి ఐజక్ జీవితం ఆదర్శనీయం



పాస్టర్ ఐజక్ అందించిన సేవల గురించి వివరిస్తున్న బిషప్ పినపాటి జాన్‌పాల్

తెనాలిరూరల్: నీతి మంతులను జ్ఞాపకం చేసుకోవడం ఆశీర్వాదకరం అని బైబిల్ గ్రంథం చెబుతోందని, యదార్థవంతంగా దేవుని సేవ చేసిన మహనీయుడు పినపాటి ఐజక్‌ను స్మరించుకోవడమూ ఆశీర్వాదకరమని పలువురు పాస్టర్లు పేర్కొన్నారు. పట్టణ మోరిస్‌పేటకు చెందిన పాస్టర్ పినపాటి ఐజక్ ప్రథమ జ్ఞాపకార్థ కూడిక సందర్భంగా రాక్ గాస్పల్ చర్చ్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెనాలి, వివిధ ప్రాంతాలకు చెందిన పాస్టర్లు, సంఘస్తులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. వివాహం కూడా చేసుకోకుండా పూర్తిస్థాయి జీవితాన్ని దేవునికి అంకితం చేసి సువార్తను ప్రకటించిన ఐజక్ అందరికీ ఆదర్శనీయుడని అన్నారు. శిఖాపల్లి జయరాజ్, ఈవూరి శ్రీనివాసరావు, ఆరె దానియేలు, ఈవూరి భారతి తదితర సంఘస్తులు పాస్టర్ ఐజక్ తమకు అందించిన ఆత్మీయ మేలుల గురించి తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెనాలి టౌన్ పాస్టర్స్ అండ్ గాస్పల్ వర్కర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బిషప్ పినపాటి జాన్‌పాల్ తన సోదరుడు చేసిన సేవలను, సంఘ అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. రెవరెండ్ ఎస్.ఇమ్మానియేల్ దాస్, బిషప్ చిలక జాన్ వరప్రసాద్, బిషప్ పాముల పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

8న ముగ్గుల పోటీలు



తెనాలి: పట్టణ ఆర్యవైశ్యసంఘం, పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతి ఉంటుందన్నారు. దేవస్థానంలో గురువారం విలేకరుల సమావేశంలో నిర్వాహకులు వివరాలను వెల్లడించారు. పోటీలో పాల్గొనే మహిళలు ముగ్గులు వేసేందుకు కావాల్సినవి వారే తెచ్చుకోవాలని చెప్పారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కొండవీటి లక్ష్మీపద్మావతి, కార్యదర్శి ఆలమూరు పూజ, కోశాధికారి ఆకి గోవర్ధన లక్ష్మి, చుండూరు రాజ్యలక్ష్మి, బొంతల ధనలక్ష్మి, చుండూరు నాగదుర్గ, కొల్ల గురునాథ గుప్తా, ఆతుకూరి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

నాటక కళాకారుడు సంజీవరావుకు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం బ్రహ్మర్షి విశ్వామిత్ర చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం తాతమ్మకల చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ సాంఘీక నాటక, టెలిఫిల్మ్ కళాకారుడు మేరుగ సంజీవరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కల్లు రాజా, వంశీ, ప్రదీప్, కలకొండ యేసురాజు, శెట్టి సిద్దార్థ, దాసరి బాలస్వామి, ప్రసన్న కుమార్, కనపర్తి బాబురావు, గరికపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక నటుడు ప్రసాద్ మృతి తీరనిలోటు



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల పౌరాణిక నటుడు, ఉపాధ్యాయుడు, సాహితీవేత్త కేవీబీఎస్‌వీ ప్రసాద్ సంస్మరణ సభను గురువారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో నిర్వహించారు. పౌరాణిక నాటకరంగంలో కర్ణుడు, దుర్యోధనుడు వంటి పాత్రలకు పెట్టింది పేరైన ప్రసాద్ మరణం తీరని లోటని వక్తలు తమ ప్రసంగాల్లో చెప్పారు. మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాటైన సభలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళారంగ ప్రముఖులు టీవీఎస్ శాస్త్రి, ఆర్అండ్‌బీ రాజు, చిట్టూరి సీతారామయ్య, గరికపాటి సుబ్బారావు, కన్నెగంటి మధు, దేవిశెట్టి కృష్ణారావు, బొల్లిముంత కృష్ణ, నల్లూరి శ్రీనివాసరావు, గంజి ప్రసాద్, ములుకుట్ల విశ్వనాథశర్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు

డ్వామా పీడీ వైఎస్ నాయక్

కర్లపాలెం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ గ్రామాలలో పనులు కల్పించాలని బాపట్ల డ్వామా పీడీ వైఎస్ నాయక్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఉపాధి హామీ పనులపై నాయక్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకుని పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం కర్లపాలెం సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. సంపద సృష్టి కేంద్రం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలని చెప్పారు. పీడీ వెంట ఎంపీడీఓ ఎలీషాబాబు, ఇన్‌చార్జ్ ఏపీఓ కిషోర్, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ కళాశాల డీన్‌కు అభినందనలు



బాపట్ల: విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసే వి.శ్రీనివాసరావు ఏజీ కళాశాల బాపట్ల డీన్‌గా బాధ్యతలు స్వీకరించటం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు అభినందించారు. ఇటీవల బాపట్ల కళాశాల డీన్‌గా బాధ్యతలు తీసుకున్న వి.శ్రీనివాసరావును బీసీ సంక్షేమ సంఘం నేతలు గురువారం కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడు తిరపతిరావు, నరసరావుపేట బీసీ నేత ఆంజనేయులు, న్యాయవాది అంగలకుదురు టి.నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి వెళ్లి పెన్షన్ అందజేత



రేపల్లె రూరల్: మండలంలోని గంగడిపాలెం గ్రామానికి చెందిన బొడ్డు వీరరాఘవయ్య ఇటీవల అనారోగ్యానికి గురై తిరుపతిలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ప్రతి నెల 1వ తేదీన అందించే జగనన్న పెన్షన్‌కానుక రూ.2750లను గ్రామ వలంటీరు భారతి తిరుపతి వెళ్లి చికిత్స పొందుతున్న వీరరాఘవయ్యకు అందజేసింది. దీంతో వీరరాఘవయ్య కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, వలంటీరు భారతికి కృతజ్ఞతలు తెలియజేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

గణపవరం(కర్లపాలెం): రబీ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని బాపట్ల ఏడీఏ ఎ.లక్ష్మి తెలిపారు. గణపవరం గ్రామ పంచాయతీ వద్ద రైతులకు పొలంబడి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విత్తనశుద్ధి చేయటం, విత్తనం మొలకశాతం పరిశీలించటంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ లక్ష్మి మాట్లాడుతూ విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని చెప్పారు. రైతులు విత్తనాలను మొలకశాతం పరిశీలించిన తరువాత విత్తుకోవాలని సూచించారు. విత్తనశుద్ధి చేయటం వలన విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్లను నివారించుకోగలుగుతామని చెప్పారు. పైరుకు పిలక దశలో ఆశించే రసం పీల్చే పురుగులను అరికట్టటానికి విత్తనశుద్ధి దోహదపడుతుందని చెప్పారు. అపరాల సాగులో గట్టుల వెంట జొన్న, మొక్కజొన్న, సజ్జ పైర్లు కంచ పైర్లుగా సాగు చేసుకోవాలని చెప్పారు. కంచ పైర్ల వలన వైరస్‌ల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను అరికట్టుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుమంత్ కుమార్ ఏఈఓ భాగ్యలక్ష్మి, వ్యవసాయ సహాయకురాలు వేదశ్రీ, రైతులు ఉన్నారు.

గడువులోగా త్రైమాసిక పన్ను చెల్లించాలి

బాపట్ల ఎంవీఐ డీబీవీ రంగారావు



భట్టిప్రోలులో వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తున్న ఎంవీఐ డీబీవీ రంగారావు

భట్టిప్రోలు: ట్రాన్స్‌పోర్టు వెహికిల్ యజమానులు చెల్లించాల్సిన త్రైమాసిక పన్నును నిర్దేశిత సమయంలో చెల్లించాలని బాపట్ల మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ డీబీవీ రంగారావు అన్నారు. భట్టిప్రోలులో గురువారం వాహనాలను తనిఖీ చేసి తగిన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైమాసిక పన్ను చెల్లించని వాహనాలకు 200 శాతం పెనాల్టీ విధించడం జరుగుతుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, కాలపరిమితి దాటిన వాహనాలు నడపడం, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడటమేనన్నారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. రహదారులపై అనుకోకుండా ఏదైనా ప్రమాదం సంభవిస్తే 108, 100 నెంబర్లకు సమాచారం ఇచ్చినట్లయితే వారి ప్రాణాలను కాపాడిన వారమవుతామని అన్నారు. డ్రైవర్లు విధిగా సీట్ బెల్టులు ధరించాలని తెలిపారు. భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో నాలుగు కేసులు నమోదు చేసి రూ. 62 వేలు అపరాధ రుసుము వసూలు చేసినట్లు ట్యాక్సులు, పర్మిట్లు, డ్రైవింగ్ లైసెన్సులు లేని వాహనాలపై కేసులు నమోదు చేయడం జరిగిందని వివరించారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో భవిత ఛిద్రం

సెబ్ సీఐ శ్రీనివాసరావు

రేపల్లె: గుట్కా, ఖైనీ వంటి నిషేధిత పదార్థాల వినియోగంతో అన్ని అనర్థాలేనని సెబ్ సీఐ డి.శ్రీనివాసరావు అన్నారు. నిషేధిత పదార్థాలపై పట్టణంలోని మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గుట్కా, ఖైనీ వంటి వాటితో పాటు మాదక ద్రవ్యాలు వినియోగించటంతో ఇటు మానసికంగా, అటు ఆర్థికంగా, శారీరకంగా అన్ని ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితులు నెలకొంటాయన్నారు. శరీరంలోని అన్ని అవయవాలు పాడవ్వటంతో పాటు జీవితకాలం తగ్గి అవస్థలపాలు కావాల్సి వస్తుందన్నారు. మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలంటే విద్యార్థుల పాత్ర ఎంతైనా ఉందన్నారు. మాదక ద్రవ్యాలు తీసుకోవటంతో కలిగే అనర్థాలను తమ తల్లిదండ్రులకు, పరిసర ప్రాంతాలలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా నిషేధిత వస్తువులను వినియోగిస్తున్నారన్న సమాచారం తెలిస్తే ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు తీసుకోవటంతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సెబ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం విశిష్టమైందని శ్రీసాయిప్రసాదం సేవాసమితి వ్యవస్థాపకుడు, విశ్రాంత బ్యాంకు అధికారి సాయి లక్కరాజు అన్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతి నెల చేపడుతున్న అన్నదానాన్ని గురువారం మధ్యాహ్నం 18వ వార్డులోని జెండా చెట్టు వద్ద చేపట్టారు. అన్నదానాన్ని సాయి లక్కరాజు ప్రారంభించారు. వార్డు కౌన్సిలరు అన్సారీ గౌస్ మాట్లాడుతూ ప్రతినెల మొదటి గురువారం క్రమంతప్పకుండా అన్నదానం చేస్తున్న సంస్థను అభినందించారు. 101 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. విశ్రాంత బ్యాంకు ఉద్యోగి కోటేశ్వరరావు, సత్యప్రకాష్, ఫణి మాధవరావు, విమల్, అఖిల్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

మంగళగిరి: నగర పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలు ప్రదర్శించినట్లు అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ హేమమాలిని తెలిపారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ నగర పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలను ప్రదర్శించడం జరిగిందని, ఓటు హక్కు పొందని వారు అందరూ ఓటు హక్కు పొందేలా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు కలిగిన వారు మార్పులు– చేర్పులు ఉంటే సంబంధిత బీఎల్ఓ వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

రేపల్లె ఆర్డీఓ పార్థసారధి



ఓలేరు సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ జె.పార్థసారధి

భట్టిప్రోలు: సచివాలయాల్లో అందిస్తున్న సేవల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రేపల్లె ఆర్డీఓ జగన్నాధం పార్థసారధి పేర్కొన్నారు. గురువారం భట్టిప్రోలు మండలం ఓలేరు సచివాలయాన్ని, తూర్పుపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, పల్లెపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. తూర్పుపాలెం పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెరుగు పరచాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పార్థసారధి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల సేవలను ప్రజలకు అందించాలని కోరారు. ప్రతి నిత్యం 20 సేవలకు తక్కువ కాకుండా సర్వీస్ చేయాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం అన్ని మండలాల్లోని గ్రామాల పురోగతిని ప్రతి వారం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. సచివాలయాల నిర్వహణ, నోటీస్ బోర్డులు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, పురోగతిని ఆరా తీశారు. ఆయన వెంట సర్పంచి మేరుగ రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు నీలా సాంబమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి ఉన్నారు.

చెరుకుపల్లి: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఆళ్లవారి పాలెం, ఆరుంబాక సచివాలయాలను గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. ఏ గ్రామంలో అయిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగితే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ స్థాయి అధికారులు అందరూ అందుబాటులో ఉండాలన్నారు. అదేవిధంగా మండల ప్రత్యేక అధికారి పి.బాలమ్మ బలుసులపాలెం, తహసీల్దార్ ప్రశాంతి చెరుకుపల్లి–2 సచివాలయాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోనేటిపురంలో...

కోనేటిపురం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురం సచివాలయం పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహణను మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ జె.హనుమంతరావు గురువారం పరిశీలించారు. గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో పరిస్థితిని పరిశీలించి గత వారం ఇచ్చిన సూచనలను అమలు చేశారో లేదోనని ఆరా తీశారు. పాఠశాలలో టాయిలెట్‌లు, హ్యాండ్ వాష్, మురుగు కాల్వ నిర్వహణను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఆయన వెంట గ్రామ సర్పంచి మోర్ల వెంకటేశ్వరమ్మ, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి ఎ.చిన వెంకటేష్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన...

వేమూరు: మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ సక్రమంగా అమలు చేయాలని మండల ప్రత్యేకాధికారి పద్మజా తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తోందన్నారు. పాఠశాల హెచ్‌ఎం నాగరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా జయంతి వార్షికోత్సవాలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా వారి ఆలయంలో నిర్వహిస్తున్న 78వ జయంతి వార్షికోత్సవాలలో భాగంగా గురువారం తెల్లవారు జామున ఓంకారం, నగర సంకీర్తన, సుప్రభాతం, కాకడ హారతి నిర్వహించారు. సాయినాధుని పాదుకలకు అభిషేకం, గులాబీలు, చామంతి పూలతో సహస్ర నామార్చన చేశారు. పూజా కార్యక్రమాలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. సాధన మండలి–బ్రహ్మ విద్యాశ్రమం(భట్టిప్రోలు) వారిచే నారాయణోపనిషత్తు, అమృత బిందోపనిషత్తు, గీతా పారాయణం, తత్వసారం జరిగింది. బాలా త్రిపురసుందరి మహిళా సమాజం ఆర్గనైజర్ అల్లం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సాయిబాబా స్తోత్ర మంజరి, బాబావారి చరిత్ర, సప్తమంజరి, యోగిరాజ శతకం, స్తుతులు గేయాలను తెలియచేశారు. రాత్రి పల్కి సేవ జరిగింది. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి బాలకృష్ణమూర్తి, కోశాధికారి బూర్లె కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.